ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
గురువారం 23 మే 2024

గెడ్డను మింగేస్తున్నారు!


వరహాల గెడ్డ పరివాహక ప్రాంతంలో ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం

- యథేచ్ఛగా వరహాల గెడ్డ ఆక్రమణ
- పరివాహక ప్రాంతాన్ని కబ్జా చేసి భవనాలు కడుతున్న వైనం
- వర్షాకాలంలో ముంపునకు గురవుతున్న లోతట్టు కాలనీలు
- చోద్యం చూస్తున్న అధికారులు

పార్వతీపురం టౌన్, మే 22: జిల్లా కేంద్రం గుండా వెళ్తున్న వరహాల గెడ్డ పరివాహక ప్రాంతంపై ఆక్రమణదారుల కళ్లు పడ్డాయి. గత కొన్నేళ్లుగా గెడ్డ పరివాహక ప్రాంతాన్ని ఆక్రమిస్తూ ఇళ్లు, పెద్దపెద్ద భవనాలను నిర్మిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఓ వ్యాపారి పార్వతీపురం ప్రధాన రహదారిలోని వరహాల గెడ్డ గట్టుని ఆక్రమించి భవన నిర్మాణానికి ప్రయత్నించాడు. అప్పట్లో ప్రజా సంఘాలు, కొత్తమంది ప్రజలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ, అడపదడపా అధికారులు కళ్లు కప్పి ఈ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఆగని ఆక్రమణలు..

వైసీపీ ఐదేళ్ల పాలనలో చెరువులు, గెడ్డలు, వాగులు ఆక్రమణకు గురైనట్లు చెరువుల పరిరక్షణ సమితి సభ్యులు బహిరంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికే వరహాల గెడ్డ పరివాహక ప్రాంతం 50 శాతానికి పైగా ఆక్రమణకు గురైంది. ఈ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా భవనాలను నిర్మిస్తోన్నారు. మరో వైపు గెడ్డ పరివాహక ప్రాంతం అన్యాక్రాంతం అవుతుంది. ఇలా గెడ్డలు, వాగులు, చెరువులు ఆక్రమణకు గురైతే భవిష్యత్‌లో ప్రకృతి వైపరీత్యాల సమయంలో జిల్లా కేంద్రవాసులకు కష్టాలు తప్పవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే వరహాల గెడ్డ ఆక్రమణలపై స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి సభ్యులు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఆక్రమణలు మాత్రం ఆగడం లేదు.

చర్యలు తీసుకోకపోతే పోరాటం చేస్తాం

జిల్లా కేంద్రంలో చెరువులు, గెడ్డలు, కాలువ గట్టులు ఆక్రమణకు గురవుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలతో కొందరు వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. పెద్దలు చేస్తే ఒప్పు.. పేదలు చేస్తే తప్పు అన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. వరహాల గెడ్డను కబ్జా చేస్తుంటే అధికారులు చోద్యం చూస్తుండడం బాధాకరం. ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోకపోతే పోరాటాలను ఉధృతం చేస్తాం.

-వి.దాలినాయుడు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు.

నిర్లక్ష్యం తగదు

అధికార పార్టీ అండదండలతో వరహాల గెడ్డ పరివాహక ప్రాంతంతో పాటు పట్టణంలోని చెరువులు, కాలువలను కొందరు ప్రముఖులు ఆక్రమిస్తున్నారు. అయినా రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. వరహాల గెడ్డ ఆక్రమణతో ప్రతి ఏటా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయి. అధికారులకు తెలిసినప్పటికీ ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు.

-ఎస్. భాస్కరరావు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి పట్టణ అధ్యక్షుడు, పార్వతీపురం.

చర్యలు తీసుకుంటాం

వరహాల గెడ్డ పరివాహక ప్రాంతం ఆక్రమణకు గురవుతున్నట్లు కొంతమంది నుంచి ఫిర్యాదు అందింది. పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ శాఖకు చెందిన అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి సమగ్ర నివేదికను ఇస్తారు. ఆక్రమణలు నిజమైతే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం.

-కె.శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్, పార్వతీపురం

ముంపునకు గురవుతున్న లోతట్టు ప్రాంతాలు..

ఆక్రమణలతో వరహాల గెడ్డ రోజురోజుకూ కుచించుకుపోతుంది. ఫలితంగా భారీ వర్షాల సమయంలో గెడ్డలోకి నీరు వెళ్లే మార్గం తక్కువై సమీపంలోని లోతట్టు ప్రాంతాల్లోకి వచ్చేస్తుండడంతో ముంపునకు గురవుతున్నాయి. ప్రతి ఏడాది జూన్ నుంచి అక్టోబరు మధ్యలో కురిసే వర్షాలకు వరహాల గెడ్డ పరివాహక ప్రాంతంలోని సౌందర్య థియేటర్ వీధి, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని గణేష్ కాలనీ, బైపాస్ కాలనీ ముంపు బారిన పడుతున్నాయి. అయినా మునిసిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం పలు విమర్శలకు తావిస్తుంది.


ఏకామ్రనాథ్, కామాక్షి అమ్మవారి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా కామాక్షి బ్రహ్మోత్సవాలు

సాలూరు రూరల్, మే 22: సాలూరులో వేంచేసి ఉన్న కామాక్షి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వినాయక పూజ, కుంకుమ పూజలు, ప్రత్యేక అభిషేకాలతో బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. సాయంత్రం ఏకామ్రనాథ్, కామాక్షి అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు రథోత్సవం నిర్వహించారు. ముత్తైదువులు కలశాలతో తెచ్చిన పవిత్ర జలాలతో అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.


సీతంపేట గురుకుల కళాశాలలో నిర్వహిస్తున్న కౌన్సిలింగ్‌కు హాజరైన విద్యార్థులు

ఇంటర్ సీట్లకు తీవ్ర పోటీ

- మూడు రెసిడెన్షియల్ కళాశాలల్లో భర్తీకి కౌన్సెలింగ్
- కొందరికే దక్కిన సీట్లు
- పూర్తిస్థాయిలో కేటాయించకపోవడంపై విద్యార్థుల్లో నిరాశ

సీతంపేట, మే 22: సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఉన్న పెద్దమడి బాలురు, సీతంపేట బాలికలు, బాలురు గురుకుల రెసిడెన్షియల్ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానిక బాలుర రెసిడెన్షియల్ కళాశాలలో జరిగిన ఈ కౌన్సిలింగ్‌కు జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. ఈ మూడు రెసిడెన్షియల్ కళాశాలల్లో 430 సీట్లు ఉన్నాయి. వీటిని భర్తీ చేయడానికి అధికారులు విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 1,181 మంది విద్యార్థులు దరఖాస్తులు పెట్టుకున్నారు. వీరిలో 1150 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. అయితే జిల్లాలో ఏకైక బాలికల రెసిడెన్షియల్ కళాశాల సీతంపేటలో ఉంది. ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 635 మంది విద్యార్థినులు దరఖాస్తులు చేసుకొని కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. దీంతో సీటు కోసం తీవ్ర పోటీ నెలకొంది. పదో తరగతిలో 530 మార్కులకు పైబడి వచ్చిన విద్యార్థినులకు ఇక్కడ సీటు లభించింది. దీంతో చాలా మంది బాలికలకు సీటు లభించక నిరాశ చెందారు. పెద్దమడి బాలురు కళాశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ కూడా సీతంపేటలోనే నిర్వహించారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతూ కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ఇక్కడ కూడా తీవ్ర పోటీ ఉండడంతో సీట్లు లభించక విద్యార్థులు నిరాశకు గురయ్యారు. చాలా మంది విద్యార్థులు 100 కిలోమీటర్ల దూరం నుంచి కౌన్సెలింగ్ హాజరుకావడం, వారికి కళాశాలలో సీట్లు లభించకపోవడంతో తీవ్ర ఆవేదన చెందారు. గిరిజన విద్యార్థులు చదువుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నప్పటికీ కళాశాలల్లో సీట్లు పూర్తిస్థాయిలో కేటాయించకపోవడంతో వారు చదువుకు దూరమై డ్రాపౌట్స్‌గా మిగిలిపోతున్నారు. కౌన్సెలింగ్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది అన్ని చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ గిరిజన సంక్షేమశాఖ అధికారి ఎం.శ్రీనివాసరావు, సీతంపేట పెద్దమడి ప్రిన్సిపాల్ పి.వి.రామారావు, సూర్యకుమారి, గురుకుల సెల్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వదలని గజరాజులు

- మరుపెంటలో నూర్పుడి యంత్రం ధ్వంసం
- సుంకిలో పంటలు నాశనం

గరుగుబిల్లి, మే 22: గరుగుబిల్లి మండలాన్ని గజరాజులు వీడడం లేదు. మండలంలోని పలు గ్రామాల్లో గత కొద్ది రోజులుగా ఏనుగులు సంచరిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండు రోజులుగా సుంకి పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. మంగళవారం సుంకిలో బి.సత్యనారాయణకు చెందిన చెరకు, అరటి, పామాయిల్, సపోటా పంటలను ధ్వంసం చేశాయి. అలాగే మంగళవారం రాత్రి మరుపెంటలో వరి నూర్పుడు యంత్రాన్ని ధ్వంసం చేశాయి. బుధవారం సుంకి పరిధిలోని కరణం రవీంద్ర పంట పొలాల్లో సంచరిస్తూ పామాయిల్, వరి పంటను నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రతి ఏటా ఖరీఫ్, రబీ పంటల సమయంలో ఏనుగులు కారణంగా అధికంగా నష్టాలబారిన పడుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగలు పంట పొలాల్లో, రాత్రి సమయంలో నాగావళి నదిలో ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు నష్టం వాటిల్లుతున్నా నేటికీ పరిహారం అందలేదని, అటవీశాఖ అధికారులు రైతుల ఇబ్బందులపై దృష్టి సారించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఏనుగుల గుంపును తరలించేందుకు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.


మరుపెంటలో నూర్పుడు యంత్రాన్ని ధ్వంసం చేసిన దృశ్యం


సంకి పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు


కొండను వెనుక నుంచి ఢీకొన్న వ్యాన్

కొండను ఢీకొన్న పెళ్లి వ్యాన్

- 25 మందికి గాయాలు

సాలూరు రూరల్, మే 22: ఓ యువకుడి పెళ్లిని నిశ్చయించేందుకు బంధువులతో వెళ్తున్న వ్యాన్ కొండను ఢీకొట్టింది. ఈ ఘటనలో 25 మంది గాయపడిన ఘటన బుధవారం ఏవోబీలో కొడంగివలస వద్ద జరిగింది. సాలూరు మండలం జగ్గుదొరవలసకు చెందిన అనిల్‌కుమార్ ఏవోబీలోని గిరిశిఖర గ్రామం చోర గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. ఇరువురికి వివాహం చేయడానికి పెద్దలు నిర్ణయించారు. ఇందులో భాగంగా గిరిజన సంప్రదాయం ప్రకారం యువతి కుటుంబీలకు యువకుడి కుటుంబీకులు తప్పు (అపరాధ రుసుం) చెల్లించాల్సి ఉంటుంది. బుధవారం తప్పు చెల్లించి, వివాహ నిశ్చయించేందుకు గాను అనిల్‌కుమార్ కుటుంబీకులు, బంధువులు 30 మంది పికప్ వ్యాన్‌లో చోర బయలుదేరారు. వాహనం కొడంగివలస వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి దిగువ (డౌన్)కు జారి రోడ్డు పక్కనే ఉన్న కొండను ఢీకొట్టింది. ఈ ఘటనలో వ్యాన్‌లో ఉన్న 25 మందికి గాయాలయ్యాయి. వీరిలో 18 మందికి మక్కువ పీహెచ్‌సీలో చికిత్స అందించారు. మరో ముగ్గురిని సాలూరు ఏరియా ఆసుపత్రికి, నలుగురిని పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. ఈ ఘటనపై సాలూరు రూరల్ ఎస్ఐ ఎం.వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇదే ప్రాంతంలో ఈ ఏడాది ఫిబ్రవరి 27న మక్కువ మండలం విజయరాంపురానికి చెందిన వారు పెళ్లి నిశ్చయం చేసుకొని కొదమకు తిరిగి వస్తుండగా వ్యాన్ బోల్తా పడింది. ఆ ఘటనలో 25 మంది గాయపడ్డారు. అదే చోట అదే విధంగా బుధవారం పెళ్లి నిశ్చయానికి వెళ్తున్న బృందానికి ప్రమాదం జరిగింది. ఈ ప్రాంతంలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


మక్కువ పీహెచ్‌సీ వద్ద క్షతగాత్రులు

ఎన్నాళ్లు బురద నీటిని ఇస్తారు?

- మునిసిపల్ కార్యాలయం ఎదుట మహిళల నిరసన

పార్వతీపురం టౌన్, మే 22: తమకు ఎన్నాళ్లు బురదనీటిని సరఫరా చేస్తారని 12వ వార్డు మేదరవీధి మహిళలు అధికారులను ప్రశ్నించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఎం పట్టణ కార్యదర్శి జీవీ రమణ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వారం రోజులకొకసారి సరఫరా చేస్తున్న తాగునీరు బురదగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నీటిని ఎలా తాగేదని ప్రశ్నించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి రమణ మాట్లాడుతూ.. మండు వేసవిలో పట్టణ ప్రజలకు సక్రమంగా తాగునీటిని సరఫరా చేయలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారని మండిపడ్డారు. పట్టణమంతా బురద నీరు వస్తున్నా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. తాగునీరే కాకుండా పారిశుధ్య నిర్వహణ కూడా అధ్వానంగా ఉందన్నారు. రానున్న వర్షాకాలంలో ఇలాగే పరిస్థితి ఉంటే ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. తక్షణమే పైప్‌లైన్‌లకు మరమ్మతులు చేపట్టి శుద్ధ నీటిని సరఫరా చేయాలని, లేదంటే మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రజలతో కలిసి నిరసనలు చేపడతామని హెచ్చరించారు.


నిరసన తెలుపుతున్న మహిళలు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

రక్తహీనతపై శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): రక్తహీనతపై శ్రద్ధవహించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గర్భిణుల్లో రక్తహీనత, ప్రసవ మరణాలు, తల్లీబిడ్డల నమోదు, ఏబీహెచ్ఏ యాప్ నమోదు, ఆసుపత్రి ప్రసవాలు, బర్త్ ప్లానింగ్, కంటి వెలుగు, 108 వాహనాలు, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గర్భిణుల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గర్భిణులకు అందిస్తున్న నివేదిక అందించాలన్నారు. 'మండల అభివృద్ధి, మాతా శిశు సంక్షేమశాఖ అధికారులు, వైద్య సిబ్బంది తనిఖీలు నిర్వహించాలి. ప్రసవ మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం చూపించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటాం. మలేరియా, డెంగ్యూ జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి. జిల్లాలో 400 గ్రామాల్లో దోమల మందును స్ప్రేయింగ్ చేయాలి. డెంగ్యూ పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా ప్రబలుతుంది. అందుకే డ్రై డేని తప్పనిసరిగా పాటించాలి. కాలువల్లో పూడిక తీత, బహిరంగస్థలాల్లో నీరు నిల్వలేకుండా చర్యలు చేపట్టాలి.' అని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె.విజయపార్వతి, డీఐవో డాక్టర్ ఎం.నారాయణ, వైద్యాధికారులు ఎం.వినోద్, శివకుమార్, డీఎల్ఆర్ ఆర్.రఘుకుమార్, టి.జగన్మోహన్‌రావు, సీహెచ్‌సీ, పీహెచ్‌సీ డాక్టర్లు పాల్గొన్నారు.



కల్కి... నాకు చాలా లక్కీ

ప్రభాస్

"కల్కి 2898 ఏడి' చిత్రం ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. మా బక్క డైరెక్టర్ (నాగ్ అశ్విన్) బుజ్జితో నన్ను మూడేళ్లు టార్చర్ పెట్టాడు. బుజ్జి (కారు) బ్రెయిన్ చిన్నదైనా నా బుర్రంతా తినేసింది. ఈ సినిమాలో బుజ్జి, భైరవ, నాగ్ అశ్విన్ ప్రతిభ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తుంది' అని ప్రభాస్ అన్నారు. ఆయన కథానాయకుడిగా, అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ లాంటి అగ్రతారలతో రూపొందుతున్న చిత్రం 'కల్కి 2898 ఏడి'. దీపికా పదుకొనే కథానాయిక. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ బేనర్‌పై సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. జూన్ 27న ఈ చిత్రం విడుదలవుతోంది. భారీ ఖర్చుతో తెరకెక్కిన ఈ సినిమా ప్రచార కార్యక్రమాలను కూడా వినూత్నంగా భారీతనం ఉట్టిపడేలా నాగ్ అశ్విన్ నేతృత్వంలో చిత్రబృందం నిర్వహిస్తోంది. బుధవారం 'కల్కి' చిత్రబృందం హైదరాబాద్‌లో 'క్యూట్ స్టార్ బుజ్జి' అనే కారును పరిచయం చేస్తూ బుజ్జి వర్సెస్ భైరవ పేరుతో భారీ ఈవెంట్‌ను నిర్వహించింది. చిత్రబృందంతో పాటు ప్రభాస్ అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బుజ్జి కారును నడుపుతూ ప్రభాస్ సందడి చేశారు. దీనికి సంబంధించిన గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ 'నేను చాలా లక్కీ. అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ లాంటి దిగ్గజాలతో నటించే అవకాశాన్ని 'కల్కి' నాకు ఇచ్చింది. కమల్‌సార్‌కి వంద దండాలు. ఇండియా గర్వించే నటుడు అమితాబ్. ఆయన స్ఫూర్తితోనే చాలామంది సినిమాల్లోకి వచ్చారు. 'సాగరసంగమం' చిత్రంలో కమల్‌హాసన్‌ను చూసి ఆయన వేసుకున్న దుస్తులు లాంటివి, కుట్టించుకొని వేసుకున్నాను. ఆ సినిమాలోని ఓ పాటలో ఆయన తలను లయబద్ధంగా ఊపే నాట్య భంగిమ చూసి నేను కూడా అలా చేయాలని ప్రయత్నించాను. దీపిక లాంటి ఇంటర్నేషనల్ స్టార్ ఈ సినిమాలో ఉండడం సంతోషం. దిశా అద్భుతమైన నటి. అశ్వనీదత్ గారు ఈ వయసులోనూ చాలా కష్టపడుతున్నారు. ఆయన ప్యాషన్ చూసి చాలా నేర్చుకోవాలి. సినిమా గ్రాండ్‌గా రావడానికి ఖర్చుకు వెనుకాడ లేదు. నిర్మాతగా 50 ఏళ్ల పాటు ఇండస్ట్రీలో ఉన్నది బహుశా ఆయనొక్కరే. మొదటి చిత్రాన్నే ఎన్టీఆర్‌తో చేశారంటేనే ఆయన రేంజ్ తెలుస్తుంది. వారి కూతుళ్లు స్వప్న, ప్రియాంక గారికి సైతం అదే ప్యాషన్, తెగింపు వచ్చాయి. వారిని చూసి ఎలా పనిచేయాలో నేర్చుకోవాలని మా చెల్లెళ్లకు చెబుతుంటాను' అన్నారు. నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'బుజ్జి... పేరు చిన్నగా అనిపిస్తుంది గానీ, అది చేసే పని మాత్రం మామూలుగా ఉండదు. ఈ సినిమాలో బుజ్జి చాలా స్పెషల్. ఇలాంటి కార్‌ను ఇంజనీరింగ్ చేయడం చాలా కష్టం. ఒక కొత్త తరహా కారు తయారు చేయాలంటే పెద్ద టీమ్ ఉండాలి. ఆనంద్ మహీంద్రా గారు ఆ టీమ్‌ను పంపడం వల్లే బుజ్జి అనే కల సాకారమైంది. దీని తయారీలో మా టీమ్ కూడా చాలా కష్టపడింది' అన్నారు. అశ్వనీదత్ మాట్లాడుతూ "కల్కి' సినిమా గురించి ఒక్కటే మాట చెబుతాను. ఇది రిలీజయ్యేంత వరకూ చిన్న సినిమా. రిలీజయ్యాక చాలా పెద్ద సినిమా' అని అంచనాలు మరింత పెంచారు.

ఇకపై థియేటర్లకు పర్సంటేజ్ చెల్లించాల్సిందే



ఇతర రాష్ట్రాల తరహాలో నిర్మాతలు పర్సంటేజీ చెల్లించాలనీ, ఇకపై అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించమని తెలంగాణ ఫిల్మ్ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. నష్టాలను తట్టుకోలేక . పదేళ్ల కాలంలో దాదాపు రెండు వేల సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూత పడ్డాయని ఆయన వెల్లడించారు.. బుధవారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ 'థియేటర్లు, ఎగ్జిబిటర్ల సమస్యలపై ఇటీవల తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్, పలువురు పంపిణీదారులు, నిర్మాతలు, ఎగ్జిబిటర్స్‌తో సమావేశమై ఎగ్జిబిటర్స్‌కు వాటాలపై కొన్ని ప్రతిపాదనలు తయారు చేశాం. దీనిపై నిర్మాతలకు జులై ఒకటి వరకూ గడువు ఇస్తున్నాం. అయితే 'కల్కి 2898 ఏడీ', 'పుష్ప 2', గేమ్ ఛేంజర్, 'భారతీయుడు 2' చిత్రాలకు మినహాయింపు ఇస్తున్నాం. ఇతర సినిమాలను పర్సంటేజ్ విధానంలోనే ప్రదర్శిస్తాం. కొంతమంది డిస్ట్రిబ్యూటర్స్ సినిమా వ్యాపారాన్ని జూదంలా మార్చారు. బెనిఫిట్ షోలు, అదనపు ఆటలతో మోసాలకు పాల్పడుతున్నారు. అందుకే ఇక నుంచి బెనిఫిట్ షోలు, అదనపు ఆటలు ప్రదర్శించం' అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి బాలగోవింద రాజ్, రవీంద్ర గోపాల తదితర సభ్యులు పాల్గొన్నారు.



లవ్ మీ.. ఓ డిఫరెంట్ ఫిల్మ్

టాలెంటెడ్ యాక్టర్స్ ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటించిన 'లవ్ మీ' చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. 'ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. విడుదల నేపథ్యంలో హీరో ఆశిష్ బుధవారం మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.


● నేను ఇదివరకు చేసిన సినిమాలకు భిన్నంగా డార్క్ తరహాలో నా పాత్ర ఉంటుంది. ఎవరైనా ఓ పని చేయవద్దని చెబితే మొండిగా అదే పని చేసే పాత్ర అది. ఇందులో యూ ట్యూబర్‌గా నటించాను. అతని దగ్గరకి ఓ దెయ్యానికి సంబంధించిన కథ వస్తుంది. అప్పుడు అతని జీవితంలో ఏం జరిగిందనేది ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడు అరుణ్‌తో మాట్లాడి హీరో పాత్ర ఎలా కనిపించాలనుకుంటున్నారో తెలుసుకుని ఆ రకంగా నటించా

● ఈ సినిమాలో ఐదారుగురు హీరోయిన్లు ఉంటారు. అయితే సినిమా మొత్తం వారు కనిపించరు. గెస్ట్‌లా అలా వచ్చి వెళుతుంటారు. ఇందులో వైష్ణవిది దెయ్యం పాత్ర కాదు. దివ్యావతి ఆ పాత్ర పోషించారు. వైష్ణవి మరో కీలక పాత్ర పోషించారు.

● ఇందులో నటించడానికి ముందు 'చంద్రముఖి', 'ముని' వంటి సినిమాలు చాలా చూశాను. ఇందులో హారర్ ఒక భాగం మాత్రమే. మంచి లవ్‌స్టోరీ కూడా ఉంది. సినిమా చూసి బయటకు వచ్చిన తర్వాత ఓ డిఫరెంట్ మూవీ చూశామని ప్రేక్షకులు సంతృప్తి చెందుతారు.

● దర్శకుడు అరుణ్ నవలా రచయిత. ఈ కథను ఆయన చెప్పిన తీరు నాకు బాగా నచ్చింది. దెయ్యంతో మాట్లాడడం, రొమాన్స్ చేయడం.. వంటి అంశాలు కొత్తగా అనిపించాయి. పీసీ శ్రీరామ్, కీరవాణి వంటి లెజెండ్స్ మా సినిమాకు పని చేయడం అంగీకరించడం మాకు ప్లస్ పాయింట్. దర్శకుడు కథ చెప్పిన విధంగా తీస్తాడా అని ఆలోచించి, మొదట పదిహేను రోజులు షూటింగ్ చేసి, బాగా వచ్చిందంటే ముందుకు వెళదాం .. అనుకున్నాం. ఆ సీన్స్ బాగా రావడంతో ప్రొసీడ్ అయ్యాం.

● ఈ సినిమా తర్వాత సెల్ఫిష్ ఉంటుంది. ఆ తర్వాత సితార బేనర్‌లో ఓ సినిమా చేయబోతున్నా.



మోదీ చిత్రంలో నటించడం లేదు

భారత ప్రధాని నరేంద్ర మోదీ బయోపిక్‌లో తను నటించడం లేదని తమిళ నటుడు సత్యరాజ్ స్పష్టం చేశారు. 'ఆ సినిమా గురించి ఇంతవరకూ ఎవరూ నన్ను అడగలేదు. నిరాధారమైన ఇలాంటి వార్తలు ఎలా పుడతాయో ఆశ్చర్యంగా ఉంది. ఇదంతా సోషల్ మీడియా సృష్టే. ఒకవేళ వారెవరైనా నన్ను అడిగినా ఆ చిత్రం చేయను. నేను నమ్మిన సిద్ధాంతాలకు వ్యతిరేకంగా నడుచుకోను' అని ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారాయన.

పారిపోయే పిరికిదాన్ని కాదు



నేను భయంతో పారిపోయే పిరికిదాన్ని కాదు.. నాకు కొంత బ్రీథింగ్ ప్లేస్ కావాలి. అందుకే రెండు రోజుల్లో మీడియా ముందుకు వస్తా. అందరి పని చెప్తా' అన్నారు నటి హేమ. బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో తను పాల్గొనలేదని ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఆమె మరోసారి స్పష్టం చేశారు. ఈ రేవ్ పార్టీలో తెలుగు నటి హేమ కూడా ఉన్నారని బెంగళూరు పోలీస్ కమిషనర్ వెల్లడించిన తర్వాత కూడా తను హైదరాబాద్‌లోనే ఉన్నానని హేమ పేర్కొనడం గమనార్హం. రెండు రోజుల నుంచి కొన్ని వందల ఫోన్ కాల్స్‌కు రిప్లయి ఇస్తున్నాననీ, నిజంగా అంత పెద్ద ఇష్యూలో ఉంటే ఫోన్ తన దగ్గర ఎలా ఉంటుంది అని హేమ ప్రశ్నించారు. తన జీవితంతో ఎవరు ఇలా ఆడుకుంటున్నారో, దీని వెనుక ఏ వెధవలు కుట్ర పన్నుతున్నారో కనిపెట్టే ప్రయత్నంలో ఉన్నాననీ, అన్నీ తెలుసుకుని మీడియాకు చెబుతానని ఆమె అన్నారు. బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో నటి హేమ కూడా పాల్గొన్నారనీ, డ్రగ్స్‌తో దొరికారని నటి కరాటే కల్యాణి సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే పోలీసులకు దొరికిపోయి కూడా హేమ ఇంకా బుకాయిస్తున్నారని 'బిగ్‌బాస్'లో పాల్గొన్న తమన్నా సింహాద్రి వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో తను కూడా ఉన్నానంటూ వచ్చిన వార్తలను యాంకర్ శ్యామల ఖండించారు. ఓ పార్టీకి మద్దతు పలికినందుకే తన గురించి ఇలాంటి ప్రచారం చేస్తున్నారని ఆమె విచారం వ్యక్తం చేశారు.

నడకా.. నరకమే!

● అధ్వానంగా గ్రామీణ రహదారులు

● మట్టితో గుంతలు కప్పుతున్న వైనం



వీఆర్ అగ్రహారంవద్ద గుంతలను మట్టితో పూడ్చిన దృశ్యం



వీఆర్ అగ్రహారం వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

రాజాం రూరల్: గ్రామీణ ప్రాంత రహదారులు అధ్వానంగా మారాయి. ఎక్కడికక్కడ మరమ్మతులు కోరుతున్నాయి. అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వం అధికారంలో పల్లె రహదారులకు మోక్షం కలగలేదు. గ్రామాల అభివృద్ధి పక్కనపెడితే.. ఊర్లోకి వెళ్లాలంటే భీతిల్లాల్సిన దుస్థితి నెలకొంది. కొత్త రహదారుల ఏర్పాటు సరేసరి.. 2014-19 మధ్యకాలంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న కాలంలో వేసిన బీటీ రహదారులకైనా కనీసం మరమ్మతులు చేయించని దుస్థితి కనిపిస్తోంది. ఎక్కడికక్కడ గోతులేర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ట్రాక్టర్లతో మట్టి తరలించే డ్రైవర్లు కొందరు గోతుల్లో మట్టిపోస్తున్నారు. వారం తిరిగేసరికి అక్కడ యథాతథ స్థితి నెలకుంటోంది. ఈ రహదారులపై ప్రయాణించే వాహనదారులకూ అవస్థలు తప్పడం లేదు.

● అంతటా ఇదే పరిస్థితి..

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాజాం-శ్రీకాకుళం ప్రధాన రహదారిలో వి.ఆర్.అగ్రహారం కూడలి నుంచి జి.సిగడాం మండలం పెంట వరకూ సుమారు ఏడు కిలోమీటర్ల మేర బి.టి. రహదారి నిర్మించారు. ఈ రహదారి పరిస్థితి అధ్వానంగా మారింది. ఇదే మార్గంలో పొగిరి జంక్షన్ నుంచి బొడ్డవలస వరకూ నిర్మించిన బీటీ రహదారి గోతులమయంగా మారింది. రాజాం-విజయనగరం మార్గంలోని కొత్తవలస జంక్షన్ నుంచి మారేడుబాక, ఇల్లంనాయుడువలస మీదుగా రింగ్‌రోడ్డుకు, గార్రాజు చీపురుపల్లి జంక్షన్ నుంచి బి.ఎస్.వలస, ఎంజెవలస, మీదుగా రాజాం-బొబ్బిలి రోడ్ వరకూ రింగురోడ్డు సైతం అధ్వానంగా మారింది. బొద్దాం నుంచి సోపేరు, రాజాం-పాలకొండ రోడ్‌లో డోలపేట నుంచి గడిముడిదాం, అమరాం, దోసరి రోడ్, కంచరాం నుంచి ఆగూరు మీదుగా దోసరి రోడ్డుపైనా నడక నరకంగానే మారింది. రాజాం పట్టణం కేంద్రంగా శ్యాంపురం మీదుగా నందబలగ, లక్ష్మీపురం, కొఠారిపురం మీదుగా రాజాం-విజయనగరం రోడ్‌ను కలిపే రింగురోడ్డు మరమ్మతులకు గురైంది. వాహన చోదకులు అనుభవిస్తున్న వెతలను దృష్టిలో పెట్టుకుని కొన్నిచోట్ల స్థానిక నేతలు మట్టితో గోతుల్ని పూడుస్తున్నారు.

ప్రతి విద్యార్థికి విద్యాకానుక అందాలి

తెర్లాం, మే 22: ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం సరఫరా చేసిన విద్యాకానుక ప్రతి విద్యార్థికి అందేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం సీఆర్పీలు కీలకపాత్ర పోషించాలని సమగ్రశిక్ష సీఎంవో ఆదినారాయణ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని విద్యాకానుకల పంపిణీ కేంద్రాన్ని సమగ్ర శిక్ష కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. కేంద్రంలోని వసతులు, బద్రతా ఏర్పాట్లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఆర్పీలతో సమావేశమయ్యారు. విద్యాకానుకలో ప్రతి వస్తువు, పుస్తకాలు అందరికీ అందేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఆయనతో పాటు అసిస్టెంట్ సి.ఎం.ఒ. రామారావు, ఎంఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పైడిమాంబ ఆలయాల్లో చండీహోమం

విజయనగరం రూరల్, మే 22: పైడిమాంబ ఆలయాల(రైల్వే స్టేషన్ వద్ద వున్న వనంగుడి, మూడు లాంతర్లు వద్ద ఉన్న చదురుగుడి)లో వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం ఉదయం చండీహోమాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో డీవీ ప్రసాద్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. చాలా మంది భక్తులు రూ.500 దేవస్థానానికి చెల్లించి, ఈ చండీహోమంలో పాల్గొనేందుకు తమ పేర్లను రిజిస్టర్ చేయించుకున్నారని తెలిపారు. ఇంకా ఎవరైనా ఉంటే, గురువారం ఉదయం 9 గంటల్లోగా రూ.500 దేవస్థానం కౌంటర్‌లో చెల్లించి, తగిన రసీదు పొంది, చండీహోమంలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

విజయనగరం దాసన్నపేట, మే 22: గ్రంథాలయ ఉద్యమ నేత రామలక్ష్మణమూర్తి సేవలు గొప్పవని జిల్లా గ్రంథాలయ సేవా సంఘం వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్, కోశాధికారి ఎర్రినాయుడు కొనియాడారు. రామలక్ష్మణమూర్తి జయంతిని పురస్కరించుకుని జీఎంఆర్ ఉపాధి శిక్షణ ప్రాంగణంలో గ్రంథాలయాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవూఫ్ మాట్లాడుతూ, గ్రంథాలయాలు విద్యాభివృద్ధికి దోహదపడతాయన్నారు. విద్యార్థుల ఉన్నతికి గ్రంథాలయాలు ఉపయోగపడతాయని, ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ ఉపాధి శిక్షణ సంస్థ ప్రతినిధి కేవీ రమణ, అధ్యాపకులు, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

రేగిడి, మే 22: రైతుకు కావాల్సిన విత్తనాలు కొరత లేకుండా ఆర్బీకేల ద్వారా అందించాలని, గతం వలే విత్తన కొరత లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఏపీ రైతుసంఘం కోరింది. ఈమేరకు జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు నారు జనార్దనరావు బుధవారం స్థానిక విలేఖర్లకు తెలిపారు. మండలకేంద్రంలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఈఏడాది ఖరీఫ్ విత్తన పంపిణీపై పటిష్ఠ కార్యాచరణ ఉండాలని, రైతుకు అవసరమైన ఆర్‌జీఎల్, సాంబ తదితర రకాల కొరత లేకుండా చూడాలని సూచించారు. ఇటీవల కాలంలో ఆర్బీకెలు విత్తన పంపిణీలో విఫలం అయ్యాయని, ఈఏడాది పాత పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఏపీ రైతుసంఘం డిమాండ్ చేసింది.

విజయమోహన్‌కు ఇండియన్ ఐకాన్ అవార్డ్

సాలూరు రూరల్ (బొబ్బిలి), మే 22: బొబ్బిలికి చెందిన విజయమోహన్ జాతీయ స్థాయి ఇండియన్ ఐకాన్ అవార్డ్ అందుకున్నట్టు రాష్ట్ర ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం(డెల్టా) గౌరవ అధ్యక్షుడు గుంపస్వామి చెప్పారు. ఆయన బుధవారం స్థానిక విలేఖరులతో మాట్లాడారు. ఈ ఏడాది మార్చిలో ఇండియా టుడే మీడియా సంస్థ క్రైట్ క్రాఫ్ట్ పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో వివిధ రంగాల్లో ప్రతిభావంతులను ఎంపిక చేసిందని, ఆంగ్ల భాషాభివృద్ధికి చేస్తున్న కృషికి విజయ్‌మోహన్‌కు ఇండియన్ ఐకాన్ అవార్డును అందించిందన్నారు. అవార్డ్‌ను ఆ సంస్థ పంపించగా డెల్టా సభ్యులు రామకృష్ణ, శ్రీనివాస్, మురళి, జగన్‌మోహన్ ద్వారా ఆయన అందుకున్నారన్నారు.

సరే పోలమ్మకు వెండి ఆభరణాలు



ఆభరణాలతో దాతలు

సాలూరు రూరల్ (బొబ్బిలి), మే 22: బొబ్బిలి యుద్ధస్తంభం సమీపాన గల సరే పోలమ్మకు బుధవారం నాలుగు కిలోల వెండి ఆభరణాలను పట్వారి నరేష్ దంపతులు అందించారు. అమ్మవారికి వెండి కిరీటం, అభయ హస్తాలు, వడ్డాణం, పల్లెం తదితర ఆభరణాలను అందించారు. వాటిని ఆలయ ధర్మకర్త బొద్దల సత్యనారాయణ సమక్షంలో సమర్పించారు.

కొనసాగుతున్న జిందాల్ కార్మికుల నిరసన

కొత్తవలస, మే 22 : మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్ నగర్‌లో ఉన్న జేఎస్ఎల్ కర్మాగారం కార్మికులు బుధవారం తమ నిరసనను కొనసాగించారు. కర్మాగారం మూసేసినందున తమకు 20 రోజులకైనా వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కర్మాగార ఉత్పాదకత వ్యయం పెరిగి పోవడం, ముడిసరుకు కొరత కారణంగా కర్మాగారానికి లాకౌట్ వేయాల్సి వచ్చిందని యాజమాన్యం చెబుతున్నందున, తమకు కనీసం 20 రోజులైనా పని కల్పించండి లేక పోతే 20 రోజులు వేతనాన్నయినా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు నిరసన శిబిరం వద్దనే వంటలు చేసుకుంటూ మధ్యాహ్న భోజనం చేస్తూ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. వీరి నిరసన కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీలకు అతీతంగా నాయకులు మద్దతు ఇవ్వడమే కాకుండా కార్మికులు చేసే వంటా వార్పు కార్యక్రమానికి అవసరమైన బియ్యం, నిత్యావసరాలను అందజేస్తున్నారు. బుధవారం తుమ్మికాపల్లి గ్రామం నుంచి వంటా వార్పుకు అవసరమైన బియ్యం ,సరుకులు వచ్చాయి.



నిరసనలో వంటావార్పు అనంతరం కార్మికులకు భోజనాలు వడ్డిస్తున్న నేతలు

కౌంటింగ్ వరకూ రాళ్లు విక్రయించవద్దు

● అడిషనల్ ఎస్పీ సునీల్ షరోనా



క్వారీ పరిశీలిస్తున్న సునీల్ షరోనా

సీతానగరం: ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు రాళ్లు విక్రయించ వద్దని అడిషనల్ ఎస్పీ సునీల్ షరోనా స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని విప్పలవలస, నిడగల్లు మరిపివ లస, సూరమ్మపేట వద్ద ఉన్న క్వారీలను పరిశీలించారు. ఈ సందర్భంగా క్వారీ యజమానుల నుంచి లీజులు అనుమతులపై అడిగి తెలుసుకున్నారు. క్వారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ రవికుమార్ ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

ఎస్.కోటలో దారగంగమ్మ ఉత్సవం



దర్శనమిస్తున్న అమ్మవారు, పండగలో గ్రామస్థులు

శృంగవరపుకోట, మే 22: శృంగవరపుకోట పట్టణంలో శ్రీదారగంగమ్మ తల్లి పండగ సందడి మొదలైంది. బుధవారం జంగిడి, పాల, కూటి ఘటాల ప్రదక్షణలు జరిపారు. గ్రామ ప్రజలు వీటితో పాటు పురవీధుల్లో తిరిగారు. దేవాలయంలో దారగంగమ్మ తల్లికి పూజారి రాజా పంతులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణ చేపట్టారు.


వేతనదారులకు సౌకర్యాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

రాజాం: ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో వి శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బందితో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ రోజు వారి కూలీ గిట్టుబాటు కావాలని, కొత్తగా పనులు గుర్తించి చేపట్టాలని, మొక్కలు పెంపకం విషయంలో అందరు ఫీల్డ్ అసిస్టెంట్‌లు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎవరు నిరలక్ష్యం చేసినా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున పనులు జరుగుతున్న ప్రాంతాల్లో టెంట్‌లు. మజ్జిగ. మంచినీటి సౌకర్యం విధిగా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ సాయినాం తదితరులు పాల్గొన్నారు.

కార్టూనిస్టు గుంట్రెడ్డికి ఉత్తమ బహుమతి



బహుమతి స్వీకరిస్తున్న భాస్కరరావు

సాలూరు రూరల్ (బొబ్బిలి), మే 22: బొబ్బిలికి చెందిన కార్టూనిస్టు గుంట్రెడ్డి భాస్కరరావుకు హైదరాబాద్‌లో జరిగిన కార్టూన్ పోటీల్లో ఉత్తమ బహుమతి లభించింది. తొలి తెలుగు కార్టూనిస్ట్ తెలిపెట్టి రామారావు జయంతి సందర్భంగా బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో కార్టూన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బొబ్బిలికి చెందిన భాస్కరరావు వేసిన కార్టూన్ ఉత్తమ బహుమతి సాధించింది. ఆయనకు ఈ బహుమతిని సినీనటుడు హర్షవర్ధన్, సామాజికవేత్త సత్యవాణి అందించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బాషాభివృద్ధి సంఘం సభ్యుడు, మామిడి హరికృష్ణ పలువురు కార్టూనిస్ట్‌లు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఉండాలి: డీఎస్పీ



లివిరిలో మాట్లాడుతున్న కృష్ణారావు

భామిని: గ్రామాల్లో ఎటువంటి అలజడులకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఉండాలని పాలకొండ డీఎస్పీ కేవీవీ కృష్ణారావు కోరారు. బుధవారం లివిరి, బాలేరు, తాలాడలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో, గొడవలకు దిగితే కేసులు నమోదైతే ఎవరూ మిమ్మల్ని కాపాడలేరని తెలిపారు. బత్తిలిలో 16 సారా కేసుల్లో స్వాధీనం చేసుకున్న 370 లీటర్ల సారా ధ్వంసంచేశారు. ఆయన వెంట సీఐ చంద్రశేఖర్, బత్తిలి ఎస్ఐ సీహెచ్ ప్రసాద్ ఉన్నారు.

గజపతినగరంలో నీలమ్మతల్లి పండుగ



అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

భామిని: మండలంలోని గజపతినగరంలో నీలమ్మతల్లి అమ్మవారి పండుగ బుధవారం సందడిగా నిర్వహించారు. ఐదు రోజులుగా సంప్రదాయబద్ధంగా అమ్మవారి పాదాలకు ముగ్రాట నీళ్లతో కడుగుతూ ప్రత్యేక పూజల చేస్తున్నారు. పండుగ ముగింపు పురస్కరించుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బంధువులు, స్నేహితులను ఆహ్వానించడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

ఆరోగ్యశ్రీ బకాయిలు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

విజయనగరం దాసన్నపేట, మే 22: రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ బకాయిలు వెంటనే చెల్లించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. బుధవారం అర్ అండ్ బీ సమీపంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆగస్టు నెల నుంచి నేటి వరకూ ప్రభుత్వం నెట్‌వర్క్ ఆసుపత్రులకు 1,500 కోట్ల బిల్లులు బకాయిలు పడి చెల్లించలేదని, అందుకే ఆరోగ్యశ్రీ సేవలను ఆసుపత్రులు నిలిపివేసే పరిస్థితి నెలకొందన్నారు. ఏపీ ప్రైవేటు మెడికల్ అసోసియేషన్ కూడా ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేస్తున్నట్టు ప్రకటించిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చామని చెబుతూనే ఆరోగ్య శ్రీ బిల్లులు చెల్లించకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైఎస్సార్ బీమాలో కొన్ని ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రభుత్వం సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో బీమా క్లెయిమ్‌లు నేటికీ మరణించిన కుటుంబాలకు అందలేదన్నారు. ఈ సమావేశంలో నాగభూషణం, భాస్కర్, నాగేశ్వరరావు, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హౌసింగ్ చెల్లింపుల్లో జాప్యం తగదు



ఉపాధి ప్రగతిపై సమీక్షిస్తున్న రాజాం క్లస్టర్ ఏపీడీ

రేగిడి, మే 22: ఉపాధి హామీపథకంలో గృహనిర్మాణానికి చెల్లించాల్సిన ఉపాధి చెల్లింపుల్లో సిబ్బంది జాప్యం లేకుండా చూడాలని రాజాం క్లస్టర్ ఉపాధి ఏపీడీ మీసాల శ్రీనివాసరావు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. స్థానిక ఏపీవో కార్యాలయంలో బుధవారం ఉపాధి ప్రగతిపై క్షేత్రసహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లతో ఏపీడీ వారాంతపు సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో ఉపాధి ప్రగతి, 90 రోజుల హౌసింగ్ బిల్లుల చెల్లింపులపై ఏపీడీ పంచాయతీల వారీగా ఆరా తీశారు. చెల్లింపుల్లో జాప్యం ఉన్న పంచాయతీలను గుర్తించి తక్షణమే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏపీవో హరనాథ్‌ను ఆదేశించారు. కొలతల ప్రాప్తికి వేతనదారులకు రూ. 300 వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఎన్ఎంఎంఎస్ యాప్‌లో హాజరు ఉండాలని సూచించారు. ఇంజినీరింగ్ కన్సల్టెంట్ రామినాయుడు, పలుగ్రామాల టెక్నికల్‌అసిస్టెంట్‌లు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కొత్తవలస, మే 22 : శృంగవరపుకోట నియోజకవర్గం నుంచి ఉమ్మడి కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన కోళ్ల లలిత కుమారి తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేసి మృతి చెందిన, ప్రమాదంలో గాయపడి వారిని బుధవారం పరామర్శించి వారికి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఒల్లుపుబంగార్రాజు(అయ్యప్ప) ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి 10 వేల రూపాయలను అందజేశారు. లలిత కుమారితో నాయకులు బొబ్బిలి అప్పారావు, గొంప దుర్గా ఉమేష్, కోళ్లవెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త చింతాడ అర్జునరావును బుధవారం టీడీపీ శాసనసభ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి పరామర్శించారు. కొత్తవలస మండలం వీరభద్రపురం గ్రామానికి చెందిన అర్జునరావు పోలింగ్ రోజున కాలువలో పడడంతో కాలికి బలంగా దెబ్బ తగిలింది. దీంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న లలిత కుమారి బాదితుడిని పరామర్శించి, ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. రూ.15వేలు ఆర్థిక సాయం చేశారు.



ఎస్.కోట ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శిస్తున్న కోళ్ల లలిత కుమారి

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

చీపురుపల్లి, మే 22: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కర్లా గ్రామానికి చెందిన మరువాడ లక్ష్మణ (22) గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమించాడు. ఈ క్రమంలో కులాంతర వివాహానికి పెద్దలు అంగీకరించరన్న భయంతో పాటు గ్రామంలో అందరికీ విషయం తెలిసిపోయిందన్న బాధతో మనస్తాపం చెందాడు. దీంతో మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లాడు. మరునాడు ఉదయాన్నే గ్రామానికి సమీపంలోని ఓ జీడిలో చెట్టుకు వేలాడుతూ శవమై కనిపించాడు. మృతుని సోదరుడు మరువాడ రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఘటనా స్థలాన్ని సందర్శించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నేలబావిలో పడి ఒకరి మృతి

దత్తిరాజేరు: మండలంలోని చినకాదపంచాయతీ రాజులపేటలో ప్రమాదవశాత్తు నేలబావిలో పడి విశాఖ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న శివాజీకుమార్ మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. పెదమానాపురం పోలీసుల కథనం మేరకు.. విశాఖపట్నం జిల్లా నక్కవానిపాలెంకు చెందిన కునుచర్ల శివాజీకుమార్(60) తన స్నేహితుడు రాజులపేట గ్రామానికి చెందిన బుద్ధ, రమేష్‌రాజు గ్రామంలో జరుగుతున్న గ్రామదేవత పండుగకు ఆహ్వానించడంతో స్నేహితులతో కలిసి మంగళవారం వచ్చారు. మధ్యాహ్నం భోజనం చేసి సరదాగా వెళ్లేందుకు బయటకు వెళ్తానని చెప్పాడు. సాయంత్రానికి రాకపోవడంతో వెతికారు. ఇంతలో 66 గ్రామ సమీపంలోని నేలబావి వద్ద దుస్తులు, షూ కనిపించాయి. బావిలో పరిశీలించగా శివాజీకుమార్ మృతదేహం కనిపించింది. బహిర్భూమికి వెళ్లిన తరుణంలో ఈ ప్రమాదం జరిగి ఉంటుంది. శివాజీకుమార్‌కు భార్య శారధాదేవి, కుమారుడు భార్గవరాజు ఉన్నారు. సరదాగా పండగకు వచ్చి మృత్యువాత పడడంతో స్నేహితులు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యాంతమయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా కేంద్రానికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుమారుడు భార్గవ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

రాజాం రూరల్, మే 22: మండల పరిధిలోని బొద్దాం గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం ఆటో బోల్తాపడిన ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. చీపురుపల్లి నుంచి రాజాం వైపు వస్తున్న ఆటో బొద్దాం వద్ద మేక అడ్డంగా రావడంతో అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని రాజాం సామాజిక ఆసుపత్రికి 108 వాహనంలో తరలించి ప్రాథమిక చికిత్స అందజేస్తున్నారు. రాజాం పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

టీడీపీ సీనియర్ నేత అనంతయ్య మృతి



శృంగవరపుకోట రూరల్: మండలంలోని బొడ్డవర గ్రామానికి చెందిన యనమదల అనంతయ్య చౌదరి (86) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. 1980 దశకంలో నియోజవర్గంలో వ్యవసాయాధికారిగా వచ్చిన ఆయన ఈ ప్రాంత రైతులకు వ్యవసాయంపై మక్కువ పెంచడంతో పాటు విభిన్నమైన పంటలు వేయడం, రైతులను ఆర్థికంగా అభివృద్ధి పరచడంలో కీలకపాత్ర పోషించారు. తన పదవీ విరమణ అనంతరం సొంత గ్రామం వెళ్లకుండా ఎన్టీఆర్ స్ఫూర్తితో ఈ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి 1990 నుంచి పెద్దఎత్తున కృషి చేశారు. జిల్లా తెలుగురైతు అధ్యక్షుడిగా, కొత్తవలస మార్కెట్‌కమిటీ అధ్యక్షుడిగానూ పనిచేశారు. ఎస్.కోట ప్రాంతంలో బీఈడీ విద్యాసంస్థలు స్థాపించి విద్యాభివృద్ధికి కృషి చేశారు. ఈయన మృతికి మాజీ ఎమ్మెల్యేలు శోభా హైమవతి, కోళ్ల లలితకుమారీ, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తదితరులు సంతాపం తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ చోరీ



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులు

శృంగవరపుకోట రూరల్, మే 22: మండలంలోని సంతగైరమ్మపేట రైతుల పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే విలువైన కాపర్‌ను దొంగలు ఎత్తుకెళ్తున్నారు. దీనివల్ల రైతులు తమ పంటలకు నీరు సకాలంలో అందించలేక ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం వేకువజామున సంతగైరమ్మపేట పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న కాపర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై రైతులు గోగాడ ఈశ్వరరావు, గనివాడ రవిరాఘవ, గోగాడ దేముదు మాట్లాడుతూ ఇలాంటి చోరీల వలన ఎండకాలంలో తమ పొలాలకు నీరు అందించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. దీనిపై పోలీసులు దృష్టిసారించి దొంగలను పట్టుకోవడంతో పాటు విద్యుత్‌శాఖ వారు వెనువెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు వేయాలని కోరుతున్నారు. రెండునెలల క్రితం జామి మండలంలో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే కాపర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారని రైతులు చెబుతున్నారు.

డీజేలు వినియోగిస్తే కఠిన చర్యలు



డీజే యజమానులకు కౌన్సిలింగు నిర్వహిస్తున్న సీఐ వెంకటరావు

విజయనగరం క్రైం, మే 22: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ముగిసినప్పటికీ, ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తూ డీజే సౌండ్స్ వినియోగిస్తే, కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ బి వెంకటరావు హెచ్చరించారు. బుధవారం ఎస్పీ దీపిక పాటిల్ ఆదేశాలతో నగరంలోని డీజే సౌండ్స్, లైటింగ్స్ యాజమానులను పిలిచి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే, చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఎక్కడైనా అల్లర్లకు పాల్పడితే, కేసులు నమోదు చేస్తామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అల్లర్లు సృష్టించే వారిని ఇప్పటికే స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించామని, అటువంటి వ్యక్తులు ఎక్కడైనా అల్లర్లకు పాల్పడితే, రౌడీషీట్స్ తెరుస్తామన్నారు.

ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు తప్పనిసరి



మాట్లాడుతున్న అన్నపూర్ణ

రామభద్రపురం, మే 22: ఉపాధిహామీ పథకం పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కనీస సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం విజయనగరం జిల్లా అంబుడ్స్ ఉమెన్ శతపతి అన్నపూర్ణ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి కొత్త పనులు మంజూరుతో పాటు ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు ఖచ్చితంగా వంద పని దినాలు ఉండేటట్లు ప్రణాళిక సిద్ధం చేశారని, పని ప్రదేశాల్లో మంచినీటి సరఫరా, వైద్య సౌకర్యాలు కల్పిస్తూ నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మస్తర్లు వేసేటప్పుడు క్షేత్ర సహాయకులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది, ఎంపీడీవో ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సమావేశానికి ముందు గజపతినగరం క్లస్టర్ ఏపీడీ జనార్దనరావుతో కలిసి ఏపీవో త్రినాథరావు దుప్పలపూడి, ఇట్లామామిడిపల్లి గ్రామాల్లో పనులను, మస్తర్లను పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏపీవో త్రినాథరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సాంకేతిక సహాయకులు శ్రీను, శేఖర్ పాల్గొన్నారు.

నేడు కోదండ రామాలయంలో భజనోత్సవం

విజయనగరం రూరల్: నగరంలోని కొత్తపేట, కోదండ రామాలయంలో వైశాఖమాస పౌర్ణ మి సందర్భంగా ప్రత్యేక భజనోత్సవ కార్యక్రమం గురు వారం జరగనుంది. సాయంత్రం 6 గంటల నుంచి ఉద యం ఆరు గంటల వరకూ 12 గంటల నిర్విరామ భజ నోత్సవం నిర్వహించనున్నారు. ఈసందర్భంగా కోదండ రామునికి మామిడి పండ్లు, పులిహోర, శనగలు ప్రసా దం నివేదించనున్నారు. అనంతరం ఆ ప్రసాదాన్ని భక్తులకు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. భజన చెట్టుకి దీపోత్సవం కార్యక్రమాన్ని కూడా నిర్వహకులు ఏర్పాటు చేశారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు


ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

మక్కువ: ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం.ఆనందరావు హెచ్చరించారు. బుధవారం మండలంలోని వెంకట భైరిపురం ఇసుక రీచ్‌ను ఎస్ఐ పి.నరసింహమూర్తితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనలు ప్రకారమే చలానా కట్టి ఇసుక తరలించేందుకు అనుమతులు తీసుకోవాలన్నారు. రాత్రివేళల్లో ఇసుక అ క్రమంగా రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించేలా చర్యలు చేపట్టా లని కోరారు. ఇసుక లోడుతో వాహనాలు దొరికితే సీజ్‌చేసి కోర్టులో హాజరుపరు స్తామని చెప్పారు. కార్య క్రమంలో ఆర్ఐ స్వాతి, కార్యదర్శి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులకు భయపెడుతున్న మబ్బులు


లివిరిలో మొక్కజొన్న పిక్కలపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

భామిని: మండలంలోని మొక్కజొన్న రైతులకు కొద్దిరోజులుగా మేఘాలను ఆవరించిన మబ్బులు, ఈదురుగాలులు భయపెడుతున్నాయి. రబీలో సాగుచేసిన పంట ప్రస్తుతం కోతకు వచ్చింది. పలు చోట్ల కంకులు కోసి రోడ్లపై ఎండబెడుతున్నారు. మరికొన్ని చోట్ల పంటను ఎండబెట్టి కల్లాల్లో సంచుల్లో నిల్వచేశారు. ఈ నేపథ్యంలో ప్రీమాన్‌సూన్‌లో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం మేఘాలు నల్లగా మారి వర్షం కురిసేలా వాతావరణం మారడంతో రైతులు ఎండబెట్టిన మొక్కజొన్న కంకులను టార్పాలిన్లతో కప్పి రక్షిస్తున్నారు. లివిరి, పసుకుడి, సింగిడి తదితర గ్రామాల్లో మొక్కజొన్న ఎక్కువగా సాగుచేశారు. పంట చేతికి వచ్చిన తర్వాత పిక్కలను సేకరించి రెండు మూడు రోజులు కనీసం ఆరబెట్టాల్సి ఉంటుంది. ఆరబెట్టే సమయంలో ఏ క్షణాన వర్షం కురుస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

పాలకొండ: పాలకొండ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు ఆధ్వర్యంలో కొనసాగుతోంది. బుధవారం డ్రాయింగ్ మాస్టార్ జి.మురళి అట్టడొక్కులు, పాతగాజులు, అగ్గి పెట్టెలతో వస్తువులను తయారీపై శిక్షణ ఇచ్చా రు.కార్యక్రమంలో గ్రంథాలయాధికారి గణేష్‌బాబు, గ్రంథాలయ సహాయకుడు ఈశ్వర్, గ్రంథ పాఠకులు పాల్గొన్నారు.

90 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

సీతంపేట: మండలంలోని గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రియ శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన రైతులు ఆర్బీకేల్లో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించేదెన్నడో?


కొట్టుగుమ్మడ వద్ద పంటపొలంలో విరిగిపడిన విద్యుత్ స్తంభం

వీరఘట్టం: వీరఘట్టం, పరిసర గ్రామాల్లో ఇటీవల ఈదురుగాలులతో కూడిన వర్షానికి నేలకూలిన విద్యుత్ స్తంభాలను నేటికీ పునరుద్ధరించలేదని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పంటపొలాల్లో బోరుబావుల వద్ద ఉన్న స్తంభాలు నేలకొరిగాయని, ఐదురోజులు గడుస్తున్నా అధికారులు చర్యలు తీసుకోలేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో పంటపొలాలను చదునుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో పొలాల్లోస్తంభాలు పడిపోవడంతో అటువైపు వెళ్లడానికి రైతులు భయాందోళన చెందుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి స్తంభాలు సరిచేసి బోరు బావులకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు అందించడంలో ప్రభుత్వం విఫలం

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఆరోగ్యశ్రీ సేవలు అందించడంలో పూర్తిగా విఫలమైందని కురుపాం నియోజకవర్గ సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ ఒక ప్రకటనలో ఆరోపించారు.కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షలాది రూపాయలు పెండింగ్ బిల్లులు ఉండడం, వాటిపై ప్రభుత్వం హామీ ఇవ్వకపోవడంతో రాష్ట్రంలో ఆరోగ్యసేవలను ఆ ఆసుపత్రులు నిలిపివేశామని తెలిపారు.ఇకనుంచి ప్రతి పేదవాడికి ఉన్నతవైద్యం కరువవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పాటుతోనైనా ఆరోగ్యశ్రీ సేవలు తిరిగి కొనసాగించాలని కోరారు.

ఇంట్లో ఉక్కపోత..బయట ఎండ


నిర్మానుష్యంగా మారిన బలిజిపేట ప్రధాన రహదారి

బలిజిపేట: మండలంలోని ఎండతీవ్రతకు ప్రజలు బుధవారం అల్లాడిపోయారు. బలిజిపేటతో పాటు పలు ప్రధానరహదారులు ఉదయం తొమ్మిది గంటల నుంచే ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారాయి. దీంతో చిరువ్యాపారులు వ్యాపారాల నిర్వహణకు ఇబ్బందిపడ్డారు. ఎండతీవ్రతకు ప్రజలు బయటకు రాకపోవడంతో వ్యాపారాలు డీలాపడ్డాయి. కొన్నిచోట్ల షాపులు మూతవేసి వ్యాపారులు ఇళ్లకు వెళ్లిపోయారు. దీనికితోడు మధ్య మధ్యలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇళ్లలో ఉక్కపోతతో ఉండలేకపోయారు. చెట్లనీడలో సేదదీరాల్సివచ్చింది. కాగా అడపాదడపా ఇటీవల వర్షాలు కురవడంతో ఖరీఫ్ కోసం రైతులు పొలాలు సిద్ధంచేస్తున్నారు. ఈనేపథ్యంలో బలిజిపేట తదితర గ్రామాల్లో తెల్లవారి వెళ్లి సాయంత్రం వరకు వ్యవసాయం పనులు చేయలేకపోతున్నారు. ప్రస్తుతం ఎండ తీవ్రతకు భయపడి ఉదయం ఏడు గంటలకే వెళ్లి పది గంటలకు ఇళ్లకు చేరుకుంటున్నారు. బుధవారం బలిజిపేట మండలంలో 12 గంటల నుంచి మూడు గంటల వరకు 40 డిగ్రీల ఉష్ణో గ్రత నమోదైంది. దీంతో ప్రజలు ఇంట్లో ఉండాలంటే ఉక్కపోత బయటకు రావాలంటే ఎండ తీవ్రత వల్ల అవస్థలుపడ్డారు.

పందిళ్ల నీడలో.. చెట్ల కింద

- ఎండ తీవ్రతకు అల్లాడిపోతున్న వేతనదారులు

బలిజిపేట: ఉపాధి వేతనదారులకు అగచాట్లు తప్పడంలేదు. పని ప్రదేశాల్లో కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. ప్రధానంగా నీడ, నీరు వంటి వసతులు కల్పించలేదు. దీంతో వేతనదారులే సొంతంగా పనిప్రదేశాల్లో పందిళ్లతో నీడను ఏర్పాటుచేసుకుంటున్నారు. కొన్ని చోట్ల చెట్ల కింద సేదదీరుతున్నారు.


వంతరాం వద్ద పందిరి కింద సేదదీరుతున్న వేతనదారులు

వసతులు లేక..

మండలంలోని 24 పంచాయతీల పరిధిలోని 28 గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం వంతరాం, బలిజి పేట, సుభద్ర, పెద్దింపేట, నారాయణపురం తదితర గ్రామాల వద్ద చెరువు పనులు జరిగే చోట ఎటువంటి వసతులు లేకపోవడంతో ఎండ తీవ్రతకు వేతన దారులు అల్లాడిపోతున్నారు. నిబంధనల మేరకు పని ప్రదేశాల్లో ప్రథమ చికిత్స కిట్లతోపాటు టెంట్లు ఏర్పాటుచేయాలి. తాగునీటి వసతి కల్పించాలి. అయితే మండుటెండలో ఉపాధి పనులు చేస్తున్నారు. సేద తీరడానికి పరదాలు లేకపోవడంతో తాటాకు పందిళ్లు వేసుకుని, చెట్ల నీడలో కూలీలు సేదదీరుతున్నారు. మండలంలో ఎనిమిదివేల మంది వరకు కూలీలు పనుల్లో పాల్గొంటున్నారు. పని ప్రదేశాల్లో నీడ, నీరు వసతి కల్పించకపోవడంతో 50 ఏళ్లు దాటిన మహిళలు అవస్థలకు గురవుతున్నారు. దీంతో కొందరు పను లకు రావడానికి ఇష్టపడడం లేదు. ఈ నేపథ్యంలో కూలీలే పనిచేసే చోట సొంతంగా పందిర్లు ఏర్పాటుచేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల దగ్గరలో ఉన్న చెట్ల నీడకు వెళ్లి సేదదీరుతున్నారు.


బలిజిపేటలో చెట్ల కింద ఉన్న కూలీలు

పథకం నిర్వీర్యం చేయడానికి కుట్ర..

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు ఆరోపించారు. పనులు చేసే చోట టెంట్లు, మజ్జిగ, మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ వంటి కనీస సదుపాయాలు లేకపోవడంతో ఉపాధి కూలీలు ఎండ తీవ్రతకు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉపాధి కూలీలకు టెంటు, మజ్జిగ, ఫస్ట్ ఎయిడ్, మంచినీరు ఇచ్చేవారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

అటకెక్కిన బ్యాంకింగ్ సేవలు

- రైతులకు తప్పని అవస్థలు
- ఇదీ జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో పరిస్థితి



కొమరాడ రైతుభరోసా కేంద్రం

కొమరాడ: పార్వతీపురం మన్యం జిల్లాలో ఆర్బీకేల్లో బ్యాంకింగ్ సేవలు అటకెక్కాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామసచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసింది. దీనికి అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) ఏర్పాటుచేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్బీకేల్లో బ్యాంకింగ్ సేవలు అందు బాటులోకి తీసుకువస్తామని అధికా రులు ప్రకటించారు. ఈ మేరకు ఆర్బీకేల్లోనే కరస్పాండెంట్లను నియమించి బ్యాంకుల మాదిరిగా సేవలందిస్తామని ప్రభుత్వం పేర్కొంది. దీంతో తమ బ్యాంకింగ్ అవసరాలకు మండల కేంద్రాలు, పట్టణ ప్రాం తాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని సంతోషించారు. అయితే వైసీపీ ప్రభుత్వం పాలనాకాలం ముగిసినా ఏ ఒక్క సచివాలయం పరిధిలో బ్యాంకింగ్ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఈ నేపథ్యంలో రైతులు సాగు పెట్టుబడులు ఇతర రుణాలకు బ్యాంకుల చుట్టూ తిరగాల్సివస్తోంది.

ఇదీ పరిస్థితి..

పార్వతీపురం మన్యం జిల్లాలో 15 మండలాల్లో 306 రైతుభరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారానే ప్రస్తుతం రైతులకు ప్రభుత్వం వివిధ సేవలను అందిస్తోంది. ఇందులో భాగంగానే ఆర్బీకేల్లో బ్యాంకులను సంబంధించిన కార్యకలాపాలు చేపట్టాలని నిర్ణయించింది. స్థానిక బ్యాంకుల ప్రతినిధులను రైతుభరోసా కేంద్రాలకు అనుసంధానించారు. రైతులకు సంబంధించిన బ్యాంకు ఖాతాల ప్రారంభం మొద లుకొని డిపాజిట్లు, నగదు చెల్లింపులు, తదితర కార్యక్రమాలకు అవకాశం కల్పించారు. జిల్లాలో బ్యాంకింగ్ సేవలు ఆర్బీకేల్లో అమలు కాకపోవడంతో రైతులు వ్యయ ప్రయాసలకులోనై మూడు నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్యాంకులకు వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడింది.

ఉన్నతాధికారులకు నివేదించాం..

ఆర్బీకేల్లో బ్యాంకింగ్ సేవలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయని గుమ్మలక్ష్మీపురం ఏడీఏ నిర్మలా కుమారి తెలిపారు. ప్రస్తుతం బ్యాంకుల కార్యకలాపాలు నిర్వహించడం లేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామని చెప్పారు.

షెడ్లు లేవు.. సౌకర్యాలు కరువు

- రోడ్డుపైనే వ్యాపారాల నిర్వహణ
- ఇదీ మక్కువ వారపు సంతలో పరిస్థితి

మక్కువ: మక్కువలో ప్రతి శుక్రవారం నిర్వహించే వారపు సంతలో సమస్య వేధిస్తున్నాయి. ఇక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడంతో సంతకు వచ్చే వ్యాపారులు, వినియోగదారులు అవస్థలకు గురవుతున్నారు. కనీసం నీడ, వ్యాపారాలకోసం షెడ్లు ఏర్పాటుచేయలేదు. ఇక్కడ ప్రతి శుక్రవారం గిరిజనులు తమకు కావాల్సిన సరకులు కొనుగోలు చేసి, ఏజెన్సీ ప్రాంతలో వారు సేకరించిన పసుపు, చీపుర్లు తదితర అటవీ ఉత్పత్తులు విక్రయించి జీవనోపాధి పొందుతున్నారు. మండలంలోని దుగ్గేరు, నంద, పనసభద్ర తదితర గిరి శిఖర గ్రామాల నుంచి ప్రజలు తెల్లవారే సంతకు వస్తారు. సంత నిర్వహిస్తున్న ప్రదేశంలో మరుగుదొడ్లు, తాగునీరు వంటి కనీస సదుపాయాలు లేకపోవడంతో మహిళలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు పాత దుస్తులు, మసాలాలు, పొగాకు, కిరాణా సామగ్రి తీసుకొచ్చి విక్రయిస్తారు. ఇక్కడ గిరిజనులు పాత దుస్తులను ఎగబడి కొనుగోలుచేస్తున్నారు. అలాగే యువత కాస్మెటిక్స్ కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. మూడు దశాబ్దాలుగా సంత నిర్వహిస్తున్నా ప్రభుత్వం ఎటువంటి వసతులు కల్పనపై దృష్టిసారించడం లేదని గిరిజనులు వాపోతున్నారు. సంత నిర్వహణ రోజు 500 నుంచి వెయ్యి మంది వరకు వస్తుంటారు. చుట్టుపక్కల గిరిజన ప్రాంతాల నుంచి సేకరించిన చింతపండు, తెనే, పిక్కలు, దుంపలు కావిళ్లతో తీసుకొచ్చి విక్రయిస్తారు. అలాగే వారికి వారంరోజులకు కావల్సిన సరుకులు కొనుగోలు చేస్తారు. అయితే సంత నిర్వహిస్తున్న ప్రదేశంలో ఎటువంటి నీడలేదు. మెయిన్‌రోడ్డు మధ్యలో ఎండలోనే క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. కనీసం కూర్చోవడానికి షెడ్లు లేకపోవడంతో సంతకు వచ్చే గిరిజనులు ఇబ్బందులుపడుతున్నారు. రోడ్డుపైనే సంత నిర్వహణ వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. దుకాణాల ముందు నిలబడితే వ్యాపారులు చీదరించుకుంటున్నారని పలువురు వాపోతున్నారు. చంటిబిడ్డలతో ఎక్కువ సమయం నిరీక్షించాల్సి వస్తోందని, ఐటీడీఏ అధికారులు స్పందించి సంతకు సమీపంలో విశ్రాంత షెడ్లు ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.



రోడ్డుపైనే వారపు సంత నిర్వహిస్తున్న దృశ్యం

గురుకులాల్లో ఇంటర్‌లో ప్రవేశాలకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు బుధవారం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో పీవో విష్ణుచరణ్ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. గురుకులాల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి బాలబాలికలకు 600 సీట్లు ఉండగా 1380 మంది గిరిజన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా వారికి ప్రవేశాలు కల్పించారు. కార్యక్రమంలో డీడీ కుర్మంగయ్య, గురుకుల కార్యాలయ సూపరింటెండెంట్ రామారావు, నిర్వాహకులు కిరణ్‌తో పాటు వివిధ గురుకుల కళాశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ ప్రవేశానికి అవకాశం

పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ ఇంటర్ ప్రవేశాలకు అవకాశం కల్పిస్తామని ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ తెలిపారు. ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో ఇంటర్ కౌన్సెలింగ్ కేంద్రంలో పదో తరగతి ఉత్తీ ర్ణులైన వారు ప్రవేశానికి భారీగా తరలివచ్చారు. దీంతో ఆయన స్పందిస్తూ ప్రతి ఒక్కరికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత అదనపు సీట్ల కోసం ఉన్నతాధికారులకు తెలియజేసి అదనపు సెక్షన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత ఏడాది ఇదే పరిస్థితి ఉంటే దృష్టి సారించినట్లు తెలిపారు.

ఏకలవ్య పాఠశాలల్లో

ఏకలవ్యమోడల్ రెసిడెన్షియల్‌స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్‌లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ త్వరలో జరగనుంది. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం, కురుపాం, కోటికపెంట, అనసభద్రల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 360 సీట్లు అందు బాటులో ఉన్నాయి.


అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో విష్ణుచరణ్